క్లుప్తంగా

ఏపీఓపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా కోట మండలానికి చెందిన జాతీయ ఉపాధి హామీ పథకం అదనపు కార్యక్రమ అధికారి పూర్ణిమను దుర్భాషలాడుతూ దాడి చేసిన నిందితులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఏపీ అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అక్టోబర్ 30న కోట మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సంఘటన దారుణమని నిరసించారు. కోట మండలం కొత్తపట్నంకు చెందిన ప్రసాద్ గౌడ్ అధికారిణిపై ఉపాధి కూలీలను ఉసిగొల్పి దాడిచేయించడం హేయమని ఖండించారు. జిల్లా స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


మాట్లాడుతున్న నాగరాజగౌడ్

తిరుపతి కల్చరల్: గత ఎన్నికల్లో కూటమి మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి చేసి వారి అభ్యున్నతికి తోడ్పడాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరు నాగరాజ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పెద్దకాపువీధిలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో బీసీలు కీలకపాత్ర పోషించారన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఇటీవల విజయవాడలోని సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. సమావేశంలో బీసీ నేత వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు


మంత్రి నాదెండ్ల మనోహర్

తిరుమల: రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్, తెలంగాణ ఎమ్మెల్యే అనిల్ కుమార్ తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు. టీటీడీ అధికారులు శ్రీవారి లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

జోరుగా వాన

తిరుమలలో జోరుగా వర్షం కురిసింది. తిరుమల శ్రీవారి దర్శించుకుని బయటకు వచ్చిన భక్తులు వర్షం ధాటికి పరుగులు తీస్తూ షెడ్ల కిందకి వెళ్లారు. కొన్ని గంటల పాటు తిరుమలలో దుకాణాలను మూసివేశారు.


తెలంగాణ ఎమ్మెల్యే అనిల్ కుమార్

ఆగమ్యగోచరం.. అధ్యాపకుల భవితవ్యం

విద్యార్థుల భవిష్యత్తు అధ్యాపకుల చేతిలో ఉంది. సమసమాజ స్థాపనలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర.. ఇవి తరచూ మన నాయకులు చెప్పే మాటలు. అధ్యాపకుల భవిష్యత్తు మాత్రం వారికి పట్టదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుపతిలోని పలు యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులపై శీతకన్ను వేసింది. వారి సర్వీసు కాలాన్ని పొడిగించకుండా కాలయాపన చేస్తోంది. దీంతో అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- తాత్కాలిక అధ్యాపకులపై కూటమి శీతకన్ను
- మహిళా వర్సిటీలో 110 జీవో అమలు
- ఎస్వీయూలో పట్టించుకోని అధికారులు
- శాశ్వత అధ్యాపక పోస్టులు భర్తీకి నోచుకోని వైనం



ఎస్వీయూ ప్రధాన ద్వారం

తిరుపతి సిటీ: తిరుపతి నగరంలో ఎస్వీయూ, పద్మావతి, ఎస్వీ వేదిక్, ఎస్వీ వెటర్నరీ తదితర యూనివర్సిటీలు ఉన్నాయి. వాటిలో సుమారు వందల మంది తాత్కాలిక అధ్యాపకులు పనిచేస్తున్నారు. వారి భవితవ్యం ప్రస్తుతం ఆగమ్యగోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా సర్వీసు కాలాన్ని పొడిగించకుండా కాలయాపన చేస్తోంది. మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా వేతనాలు పెంచడం లేదు. ఇంక్రిమెంట్ల గురించి ఆలోచనా చేయడం లేదు.

ఎస్వీయూ అమలుకు నోచుకోని 110 జీవో

పద్మావతి మహిళా వర్సిటీలో ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన వీసీ వర్సిటీలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ల కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన 110 జీవోను పూర్తి స్థాయిలో అమలు చేశారు. 2024–25 అకడమిక్ ఇయర్‌కు సంబంధించి 11 నెల సర్వీసును పొడిగించి, ఇంక్రిమెంట్ సైతం మంజూరు చేశారు. ఎస్వీయూలో 110 జీవో గురించి పట్టించుకున్న పాపానపోలేదు. అకడమిక్ ఇయర్ ఎక్స్‌టెన్షన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. అధ్యాపకులకు సామర్థ్య పరీక్షల పేరుతో ఇంటర్వ్యూలు నిర్వహించి పెద్ద సంఖ్యలో అకడమిక్ కన్సల్టెంట్లను తొలగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వర్సిటీకి పూర్తి స్థాయి వీసీని నియమించిన తర్వాత ప్రక్రియను ప్రారంభించాలనే ఉద్దేశంతో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

అన్ని వర్సిటీలలోనూ అదే పరిస్థితి

ఎస్వీ వేదిక్ వర్సిటీలో పనిచేస్తున్న సుమారు 40 మంది తాత్కాలిక అధ్యాపకుల వేతనాలు సవరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని వారు చాలా రోజుల నుంచి టీటీడీని కోరుతున్నారు. వారి ఆవేదన అరణ్య రోదనగానే మిగిలిపోతోంది. అలాగే ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో పశువైద్య కళాశాలలో పనిచేస్తున్న సుమారు ఏడుగురు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వం చేపట్టే శాశ్వత అధ్యాపకుల నియామకాల్లో తమకు తగిన ప్రాధాన్యత ఇస్తారని భావించినా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

యూనివర్సిటీ	తాత్కాలిక అధ్యాపకులు
ఎస్వీయూ	263
పద్మావతి మహిళా వర్సిటీ	108
ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ	42
ఎస్వీ వెటర్నరీ కళాశాల	7

నోటిఫికేషన్ విడుదలైనా.. పోస్టుల భర్తీ లేదు

గత ప్రభుత్వం వర్సిటీల్లో శాశ్వత అధ్యాపకుల నియామకం కోసం నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులను సైతం ఆహ్వానించింది. సార్వత్రిక ఎన్నికలు రావడంతో భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 6 నెలలు గడుస్తున్నా పోస్టుల భర్తీకి చొరవ చూపడం లేదు. దరఖాస్తులు చేసుకున్న ఎంతోమంది అభ్యర్థులు భర్తీ ఎప్పుడు చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఎస్వీయూలో సుమారు 230 పోస్టులు, మహిళా వర్సిటీలో 89 పోస్టులకు గత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

ప్రభుత్వం ఆదుకోవాలి

వర్సిటీల్లో ఎన్నో ఏళ్లుగా తాత్కాలిక అధ్యాపకులుగా పనిచేస్తున్నామని, నూతన ప్రభుత్వం పెద్ద మనసుతో తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి మిగిలిన ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు కోరుతున్నారు. ఇతర ఉద్యోగాలకు వయోపరిమితి అడ్డురావడంతో ఎటూ వెళ్లలేని పరిస్థితిలో ఉన్నామని, తమ సేవలను గుర్తించి న్యాయం చేయాలని పేర్కొంటున్నారు. తాత్కాలిక ఉద్యోగులను మరో ఏడాది కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, వేతనాలు పెంచడంతోపాటు సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళా కళాకారులకు సత్కారం


మహిళా కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్: ఉత్తమ ఉపాధ్యాయుడిగా, కళాకారుడుగా కళామతల్లికి సేవలు అందించిన ఆనందరావు జయంతి పురస్కరించుకుని మహిళా కళాకారులను ఘనంగా సత్కరించారు. ఆదివారం కపిలతీర్థం రోడ్డులోని కొత్తపల్లి కళాక్షేత్రంలో కళాకారుడు కొత్తపల్లి ఆనందరావు జయంతి సభను ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు కళాకారులు హాజరై ఆనందరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆనందరావు తండ్రి, కళాకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి మునిరత్నం, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి మాట్లాడారు. ఆనందరావు సేవలను కీర్తించారు. అనంతరం ఐదుగురు మహిళా కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్.రాజా, జయచంద్ర, సుబ్రమణ్యం, పొన్నాల జేజిరెడ్డి, సిద్ధారెడ్డి, విజయ్‌కుమార్, కోటేశ్వరరావు, రజిని, యశోద, శైలజ, అమరావతి, కల్పన, ఉష, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ వాకథాన్



వాకథాన్ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, సిబ్బంది

తిరుపతి కల్చరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి రీజియన్ పరిధిలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలో బ్యాంక్ ఉద్యోగులు బాలాజీ నగర్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు వాకథాన్ నిర్వహించారు. అన్ని రంగాల నుంచి ప్రజలకు అవినీతి రహిత భారతదేశాన్ని అందించాలని నినాదాలు చేశారు. అవినీతి నిర్మూలనకు పౌరులందరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. వాకథాన్ అనంతరం క్లీన్ అండ్ గ్రీన్ ఇండియా కోసం ఎస్వీ యూనివర్సిటీ ప్రాంతంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో యూనియన్ ఆఫ్ ఇండియా డెప్యూటీ రీజినల్ హెడ్స్ వి.బ్రహ్మయ్య, అభిమన్యు కుమార్, రీజినల్ విజిలెన్స్ ఆఫీసర్ గిరిధర్, ఛీఫ్ మేనేజర్లు రవికుమార్, ప్రతాప్, శబరీష్, పృథ్వి, సయ్యద్ రఫీక్, బి.రాకేష్, సంధ్య, 140 మంది యూనియన్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

తిరుపతి అర్బన్: తిరుపతిలోని టీపీపీఎం హైస్కూల్లో 1995–96లో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో, వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా హాజరయ్యారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాలతో సందడి చేశారు. తమ ఉన్నతికి బాటలు వేసిన గురుదేవులు మునిరామయ్య, వెంకటేశ్వర్లు, పర్వత రెడ్డి శ్రీదేవి, ఆనందకు సన్మానించి ఆశీస్సులు పొందారు. తొలుత తమ బ్యాచ్‌లో మరణించిన సహచరుల ఆత్మశాంతికి నివాళులు అర్పించారు. కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు.


క్లిక్.. క్లిక్: గురువులతో పూర్వ విద్యార్థులు

తిరుపతి రైల్వేస్టేషన్‌కు

డివిజన్ హోదా దక్కేనా?

- మహర్దశ కోసం ఏ–క్లాస్ రైల్వే స్టేషన్ ఎదురుచూపు
- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ రాక

రూ.300 కోట్లతో తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు సాగుతున్నాయి. ఆదాయపరంగా చూస్తే ఏ–క్లాస్ రైల్వేస్టేషన్ ఉంటోంది. రోజూ లక్ష పైచిలుకు ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రైల్వేస్టేషన్‌ను డివిజన్‌గా చేయాలనే డిమాండ్ ఎంతోకాలంగా ఉంది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో దీనిపై చర్చించి ఏ నిర్ణయం తీసుకుంటారో? అనే ఆసక్తి స్థానికుల్లో నెలకొంది.

- రైల్వే అభివృద్ధిపై తిరుపతిలో నేడు సమీక్ష



తిరుపతి రైల్వేస్టేషన్ (ఫైల్)

తిరుపతి అర్బన్: రైల్వే అభివృద్ధికి సంబంధించి తిరుపతిలోని తాజ్ హోటల్‌లో సోమవారం పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు. స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ బృందం ఆదివారం తిరుపతికి చేరుకుంది. ఉదయం హోటల్‌లో సమీక్షిస్తారు. జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రైల్వే పనులకు సంబంధించి భూసేకరణ, భూ పరిహార చెల్లింపులతో పాటు పలు అంశాలపై చర్చించనున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తోపాటు డీఆర్‌ఎం విజయకుమార్, తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, వివిధ విభాగాల రైల్వే ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. అనంతరం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్రంలో రైల్వే అభివృద్ధికి సంబంధించి పార్లమెంటరీ కమిటీ సమావేశం నిర్వహిస్తారు. అనంతరం రీమోడల్‌లో భాగంగా రెండేళ్లుగా సాగుతున్న తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను మధ్యాహ్నం బృందం పరిశీలించనుంది.

దశాబ్దాలుగా డివిజన్ హోదా ప్రతిపాదన

తిరుపతి రైల్వే స్టేషన్‌కు రైల్వే డివిజన్ హోదా కోసం దశాబ్దాలుగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఎందరో నాయకులు డిమాండ్ చేయడంతోపాటు రైల్వే ఉన్నతాధికారులకు వినతులు సైతం ఇచ్చారు. అంతేకాకుండా గతంలోనే డివిజన్ హోదాపై ప్రతిపాదనలు సైతం పంపినప్పటికీ ఇప్పటి వరకు ఆ హోదా గురించి ప్రకటించలేదు. రైల్వే స్టేషన్‌కు వస్తున్న ప్రయాణికుల రద్దీ, రాబడి, వసతులను ఆధారంగా చేసుకుని రైల్వే స్టేషన్లను ఏ–క్లాస్, బీ–క్లాస్, సీ–క్లాస్‌గా విభజిస్తారు. రాష్ట్రంలో ఏ క్లాస్ రైల్వే స్టేషన్లుగా తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంకు మాత్రమే హోదా ఉంది. ఈ క్రమంలో విజయవాడ, విశాఖపట్నంకు రైల్వే డివిజన్ హోదా కల్పించారు. అయితే తిరుపతి మాత్రమే డివిజన్ హోదాకు నోచుకోలేదు. దీంతో గతంలో తిరుపతి డివిజన్ హోదాపై పలువురు ఇచ్చిన డిమాండ్ మేరకు ప్రతిపాదనలు పంపినా దీనిపై కదలిక లేదు. గుంతకల్ డివిజన్ హోదా ఉన్నప్పటికీ ఏ–క్లాస్ రైల్వేస్టేషన్‌గా గుర్తింపు లేదు. దీంతో సోమవారం తిరుపతిలో నిర్వహించనున్న పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమీక్షలో రైల్వేల అభివృద్ధిపై చర్చల్లో తిరుపతి డివిజన్ హోదా అంశం కూడా చర్చకు రావచ్చని పలువురు భావిస్తున్నారు. కేవలం చర్చకే పరిమితం కాకుండా ఆచరణాత్మక నిర్ణయం తీసుకోవాలని జిల్లా ప్రజలు వాంఛిస్తున్నారు.

బిర్యానీలో బొద్దింక..!

తిరుపతి తుడా: తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని స్పైసీ పేరడైజ్‌లో ఓ వ్యక్తి రూ.1,255 చెల్లించి ఆదివారం బకెట్ బిర్యానీని స్విగ్గి ద్వారా ఆర్డర్ చేశారు. బకెట్ ఓపెన్ చేసి వడ్డిస్తున్న క్రమంలో బిర్యానీలో బొద్దింక కనిపించడంతో అందరూ అవాక్కయ్యారు. సంబంధిత ఆర్డర్ చేసిన వ్యక్తి హోటల్ యాజమాన్యాన్ని సంప్రదిస్తే నిర్లక్ష్యంగా బదులిచ్చినట్లు తెలుస్తోంది. తిరుపతిలో పలు హోటల్లో తరచూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా, పాచిన కూరలు, కుళ్లిన వంటకాలతో యాత్రికులను బురిడీ కొట్టిస్తున్నా జిల్లాలోని ఫుడ్ సేఫ్టీ యంత్రాంగం నిద్రావస్థలో ఉంది. తరచూ హోటల్లో తనిఖీ చేసి ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతుండడంతోనే హోటళ్ల యజమాన్యాలు ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.



నూతనోత్సాహం

వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడిగా భూమన కరుణాకరరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. పలువురు పార్టీ నాయకులు, అభిమానులు గజమాలలతో ఆయన్ను ఆత్మీయంగా సన్మానించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పార్టీని మరింత క్రియాశీలకంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

– తిరుపతి రూరల్/ తిరుపతి అర్బన్


సమావేశం అనంతరం భోజనం చేస్తున్న పార్టీ నేతలు



భూమన కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న చంద్రగిరి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, సభా ప్రాంగణం వద్ద నృత్యం చేస్తూ సందడి చేస్తున్న యువత




పార్టీ నేతలు, అభిమానులు గజమాలలతో భూమన కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యాలు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని ఉదయం10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సమస్యలపై వినతిపత్రంతో పాటు ఆధార్ కార్డు జెరాక్స్, ఫోన్ నంబర్లను పొందుపర్చాలని ఆమె కోరారు.

గంజాయి స్మగ్లింగ్ కట్టడికి ప్రత్యేక దృష్టి

– హోంమంత్రి అనిత

తిరుపతి క్రైమ్: రాష్ట్రంలో గంజాయి స్మగ్లింగ్‌ని కట్టడి చేసేందుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. ఆదివారం సాయంత్రం ఐజీ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ, తిరుపతి, చిత్తూరు ఎస్పీలు సుబ్బరాయుడు, మణికంఠ, ఏఎస్పీలు, డీఎస్పీలు, ఇతర అధికారులతో ఆమె సమీక్షించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. చిన్నపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎలా అరికట్టాలో కూలంకషంగా పోలీస్ అధికారులతో చర్చించినట్లు చెప్పారు. పబ్లిక్ ప్రదేశాలు, దేవాలయాలు, ఆస్పత్రుల వద్ద సీసీటీవీ కెమెరాలను ఇంటిగ్రేట్ చేస్తామన్నారు. ఒక్కో సబ్ డివిజన్‌కు ఒక్కో డ్రోన్ ఏర్పాటు చేస్తామన్నారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు చెక్ పెట్టే దిశగా చెక్ పోస్టుల వద్ద పోలీసులు, సీసీ కెమెరాల నిఘా భారీ స్థాయిలో పెంచుతామన్నారు. ఇదలా ఉంచితే, మాజీ మంత్రి రోజా ఏమైనా మాట్లాడుతుందని, ఆమె మాట్లాడిన విషయాలపై తమను మీడియా ప్రశ్నించాల్సిన అవసరం లేదన్నారు. విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో బాధితులకు సీఎం చంద్రబాబు అండగా ఉన్నారని చెప్పుకొచ్చారు. పులిహోర పొట్లాల గురించి మాట్లాడే హక్కు వైఎస్సార్ సీపీ వారికి లేదన్నారు.

క్రాఫ్ట్ మేళా విజయవంతం

రేణిగుంట : మండలంలోని కరకంబాడి ఇందిరానగర్‌లోని రాస్ ప్రాజెక్టు కార్యాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా సహకారంతో ఆదివారం నిర్వహించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మేళా విజయవంతమైంది. పిల్లల్లో దాగి ఉన్న కళలను ప్రోత్సహించడమే లక్ష్యంగా వేస్ట్ మెటీరియల్‌తో తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఏకాగ్రత, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతాయని ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రమీల, హేమశేఖర్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి ఉత్తమ ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ భారతి, శైలజ, వెంకటేష్, ఉష, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.